GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 15-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# కడ్తాల్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

రూ.20 లక్షల విలువైన 170 గ్రాముల క్రిస్టల్ మెథాంఫెటమైన్ స్వాధీనం

మహేశ్వరం జోన్ ఎస్ఓటీ, కడ్తాల్ పోలీసుల సంయుక్త దాడిలి

ఇద్దరు అరెస్ట్, మరో ఇద్దరి కోసం గాలింపు



5లో

# ఎన్‌హెచ్– 65పై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

o 7 హోటళ్ల లైసెన్స్‌లు సస్పెండ్, లైసెన్స్ లేని హోటల్ సీజ్



**నల్లగొండ, (క్రైమ్ మిర్రర్):** జాతీయ రహదారి-- 65పై హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల్లో టీజీ ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం ప్రత్యేక ఆహార భద్రత తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టారు. మొత్తం 10 ప్రత్యేక బృందాల్లో సుమారు 60 మంది అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం 20 ఆహార వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, పరీక్షల నిమిత్తం 20 ఆహార నమూనాలను సేకరించారు. నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిన ఏడు సంస్థల లైసెన్స్‌లను సస్పెండ్ చేయగా, లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న ఓ హోటల్‌ను సీజ్ చేశారు. మరోవైపు నిబంధనల ఉల్లంఘనలపై షోకాజ్, మెరుగుదల నోటీసులు జారీ చేశారు.

మిగతా 2లో

# మాదాపూర్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయం.. ముగ్గురు అరెస్ట్

1 గ్రాము డ్రగ్స్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** మాదాపూర్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక గ్రాము ఎండీఎంఏగా అనుమానిస్తున్న మాదక పదార్థంతో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఎస్.ఐ. నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిద్ది వినాయక నగర్‌లోని రాజ్ టవర్స్ సమీపంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా కట్ల మాధవ్ అలియాస్ టోనీ (25), నామాల సిద్ధార్థ్ (25), ఎరుగు లోకేష్ (26)లను అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో కట్ల మాధవ్ బెంగళూరులో గుర్తుతెలియని వ్యక్తి వద్ద ఒక గ్రాము ఎండీఎంఏను రూ.6 వేలకే కొనుగోలు చేసి, హైదరాబాద్‌కు తీసుకొచ్చి సిద్ధార్థ్‌కు రూ.10 వేలకు విక్రయించినట్లు వెల్లడైంది. సిద్ధార్థ్ ద్వారా లోకేష్‌తో పాటు ఇతరులకు కూడా డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1605/2026 కింద ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ముగ్గురిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల వివరాలను తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ విక్రయాలు లేదా సరఫరా గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని మాదాపూర్ పోలీసులు సూచించారు.

# రైతులకు 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందించాలి



**క్రైమ్ మిర్రర్,మంగపేట:** రైతులకు నాణ్యమైన 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మంగపేట మండల విద్యుత్ ఉపకేంద్రం వద్ద బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుడుముల లక్ష్మి నారాయణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ అందించి సాగు చేసిన పంటలకు నీరు అందించి పంటలు ఎండిపోకుండా వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత ప్రజాపాలన అందిస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులకు కనీసం ఆరు గంటలు కూడా నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ అందడం లేదని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. మండుతున్న ఎండల్లో విద్యుత్ కోతల కారణంగా పంటలకు సకాలంలో నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు ఎండిపోతాయనే భయంతో నష్టాలపాలయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగు నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు మంత్రి సీతక్కకు కనిపించడం లేదా అని కుడుముల లక్ష్మి నారాయణ ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, రైతులు విద్యుత్ కోసం రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడటమే కాకుండా, క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులకు నాణ్యమైన 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందించేలని కోరుతూ ఏ ఈ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మేడారం ట్రస్ట్ బోర్డ్ మాజీ డైరెక్టర్ చిలకమర్రి రాజేందర్,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కోరం సంతోష్,పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, డైరెక్టర్ అచ్చ సత్యనారాయణ మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం,మాజీ మండల యూత్ అధ్యక్షుడు గుమ్మలా వీరాస్వామి సోషల్ మీడియా వారియర్స్, బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి, గంధం కిషోర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆర్థ్రోస్కోపీ పరికరాల ఏర్పాటు

**రూ.18.33 లక్షలతో ఆధునిక వైద్య పరికరాలతో సేవలు**

**కార్మికులకు మెరుగైన వైద్య సేవలకు అవకాశం**



**రామచంద్రాపురం, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్:** సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఆర్థ్రోస్కోపీ పరికరాలను ఏర్పాటు చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా కాన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ సంస్థ ఈ పరికరాలను విరాళంగా అందించింది. 100 పడకల సామర్థ్యం కలిగిన ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్స్ విభాగానికి 20 పడకలు కేటాయించారు. ప్రమాదాల వల్ల కలిగే గాయాలు, క్రీడా గాయాలు, కీళ్ల సమస్యలతో వచ్చే రోగులకు ఈ విభాగం ద్వారా చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థ్రోస్కోప్ పరికరంతో పాటు అవసరమైన ఇన్‌స్ట్రుమెంట్ సెట్‌ను శ్రీ సహస్ర మెడిఫెస్ సంస్థ ద్వారా కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. ఇందుకోసం మొత్తం రూ.18,33,300 ఖర్చు చేశారు. ఈ పరికరాల అందుబాటుతో కీళ్ల సమస్యల నిర్ధారణ, చికిత్సతో పాటు ఆర్థ్రోస్కోపీ విధానంలో శస్త్రచికిత్సలు నిర్వహించడం మరింత సులభతరం కానుంది. తద్వారా బీమా పొందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర ఈఎస్ఐ లబ్ధిదారులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## ఎన్‌హెచ్- 65పై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

తనిఖీల్లో భాగంగా నల్లగొండ జిల్లాలో 10, సూర్యాపేట జిల్లాలో ఆరు, యాదాద్రి భువనగిరి జిల్లాలో నాలుగు సంస్థలను తనిఖీ చేశారు. ఆయా హోటళ్లలో పప్పుధాన్యాలు, చికెన్ కర్రీ, టీ పొడి, జీడిపప్పు, పనీర్, వంటనూనె, సాస్‌లు తదితర ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు.

### అపరిశుభ్రతపై అధికారుల ఆగ్రహం

పలు హోటళ్లలో పురుగులు, బొద్దింకలు, అపరిశుభ్రమైన రిఫ్రిజిరేటర్లు, ఫంగస్ పట్టిన కూరగాయలు, ఎలుకల విసర్జనలతో కలుషితమైన ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు. శాకాహార, మాంసాహార పదార్థాలను కలిపి నిల్వ చేయడం, పచ్చి మాంసంతో ఐస్ ముక్కలను ఉంచడం, వంటగదుల్లో పరిశుభ్రత పాటించకపోవడం వంటి లోపాలు వెలుగుచూశాయి. అనుమతిలేని సింథటిక్ రంగుల వినియోగం, ఆహార పదార్థాల లేబులింగ్‌లో లోపాలు, సిబ్బంది వైద్య ధ్రువపత్రాలు, పురుగుల నియంత్రణ రికార్డులు లేకపోవడాన్ని కూడా గుర్తించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే తనిఖీల లక్ష్యమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల నిర్వాహకులు చెల్లుబాటు అయ్యే ఆహార భద్రత లైసెన్స్‌లను ప్రదర్శించాలని, వంటగదులు, నిల్వ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివశంకర్ రెడ్డి ఉన్నారు.

## టీజీసేఫ్ తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి

**ఏడు హోటళ్ల లైసెన్సులు సస్పెండ్.. నమూనాల సేకరణ**

టీజీసేఫ్ తనిఖీల్లో కొన్ని చోట్ల కూరగాయలు కుళ్లిపోయి ఉండగా, మరికొన్ని చోట్ల ఆహార పదార్థాలపై ఫంగస్ కనిపించిందని, ఫ్రిజ్‌లలో శాకాహార, మాంసాహార పదార్థాలను ఒకేచోట కలిపి నిల్వ చేయడం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను ఉంచడం, వండిన ఆహారాన్ని వార్తాపత్రికలపై పెట్టడం వంటి ప్రజారోగ్యానికి హాని కలిగించే చర్యలకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. పీపుల్ కంబైన్ హాస్పిటాలిటీలో పెసరపప్పుపై పురుగుల బెడద, అపరిశుభ్రమైన ఫ్రిజ్ లు, తుప్పుపట్టిన వంట పరికరాలు, సరైన పద్ధతిలో ఆహార పదార్థాలను నిల్వ చేయకపోవడం వంటి లోపాలు గుర్తించారు. అమ్మచేతి వంటలో కుళ్లిన కూరగాయలు, జీడిపప్పు, శనగపిండి వంటి పదార్థాలపై ఫంగస్ , అపరిశుభ్రమైన ఫ్రీజర్లు, వంట పరికరాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తనూజా హోటల్స్‌లో జారుడుగా మారిన దెబ్బతిన్న వంటగది నేల, ఆహార వ్యర్థాలతో నిండిన డ్రైనేజీ ట్రాప్స్ , బొద్దింకలు, ఈగలు, కుళ్లిన టమాటాలు, నిమ్మకాయలు గుర్తించారు. శ్రీ ఆద్య గ్రాండ్ రెస్టారెంట్ లో ఉపయోగించిన నూనె ముదురు రంగులో ఉండటంతో పాటు, ఫ్రిజ్ లో శాకాహార, మాంసాహార పదార్థాలను కలిపి ఉంచినట్లు తనిఖీల్లో వెల్లడైంది. అకడ గడువు ముగిసిన, లేబుళ్లు లేని ఆహార పదార్థాలు కూడా గుర్తించారు. ఏవీఆర్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ (సంగం హోటల్ )లో బిర్యానీకి సంబంధించిన మిగిలిపోయిన చికెన్ ముకలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, ఆహారంపై ఎలుకల విసర్జనలు, ఫంగస్ పట్టిన మునగకాయ ముకలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. హైవే హాస్పిటాలిటీలో తినేందుకు ఉపయోగించే ఐస్ ముకలను పచ్చి మాంసంతో కలిపి నిల్వ చేయడం, లేబుళ్లు లేని పదార్థాలు, తుప్పుపట్టిన స్టాండ్లు గుర్తించారు. శ్రీ మమత లాడ్జ్ అండ్ రెస్టారెంట్ లో కుళ్లిన గుడ్లు, చెడిపోయిన కూరగాయలు, జిడ్డు పేరుకుపోయిన స్టవ్ లు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, సరైన డ్రైనేజీ, గాలి ప్రసరణ లేకపోవడాన్ని గుర్తించారు.

## వేములనర్వలో గంజాయి స్వాధీనం..

**ం ఒకరిపై కేసు నమోదు**

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** వేములనర్వ గ్రామ శివారులోని ఆర్కాన్ మినరల్స్ స్టోన్ క్రషర్ ప్రాంగణంలో పోలీసులు సుమారు 33 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్టోబర్ 13న పోలీసులు, క్లూస్ టీమ్, పంచ సాక్షులతో కలిసి ఓ గదిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రామకృష్ణ పటేల్ (31) నివసిస్తున్న గదిలో గంజాయిగా అనుమానిస్తున్న పదార్థం లభించిందని. ఈ ఘటనపై కేశంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ఎస్ఐ బి. పరమేష్ దర్యాప్తు చేస్తున్నారని గ్రామాలలో మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ ప్రజలను కోరారు.



# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సంస్థాన్ విద్యార్థిని ఎంపిక



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని అండర్-19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు భువనగిరిలో నిర్వహించగా, ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎరుకొండ హారిక రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ దీప, వ్యాయామ ఉపాధ్యాయుడు కట్ట వెంకటేష్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యం.. పారిశుద్ధ్యానికి పెద్దపీట

**సంగాయపల్లిలో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** సంగాయపల్లి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ రాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సంగాయపల్లిలో అండర్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని సంగాయపల్లి గ్రామంలో 100 అడుగుల అండర్ డ్రైనేజీ పనులను రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల--శ్రీశైలం యాదవ్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో మురుగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించవచ్చని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను కాపాడేందుకు సహకరించాలని సూచించారు. అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తగ్గి, ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్, ఉపసర్పంచ్ సప్పిడి ఆంజనేయులు, వార్డు సభ్యులు పెరుమళ్ళ నరేష్, పబ్బ రమేష్, మాజీ ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు వేదం ఉదయ శంకర్, అనురాధ తిరుపతయ్య, నాయకులు వెంకటరెడ్డి, యువ నాయకుడు పబ్బ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# తొమ్మిది రోజులు కాదు.. ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ!

**ం అగ్నిప్రమాదం తర్వాత మారిన ఆనవాయితీ.. తరతరాలుగా కొనసాగుతున్న గుండాల ప్రత్యేక సంప్రదాయం!**

**ం ఏడు రోజుల బతుకమ్మ వెనుక ఆసక్తికరమైన చరిత్ర.. గౌరీదేవి ఆశీస్సులతో కొనసాగుతున్న పండుగ సంబరం!**

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయ పండుగ బతుకమ్మ.. సాధారణంగా తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల గ్రామంలో మాత్రం ఏడు రోజులకే ముగుస్తాయి! తొమ్మిది రోజుల సంప్రదాయానికి భిన్నంగా ఏడో రోజే సద్దుల బతుకమ్మను నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ఆచారం వెనుక తరతరాలుగా గ్రామస్తులు చెప్పుకుంటున్న చరిత్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. అసలు గుండాలలోనే ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ ఎందుకు నిర్వహిస్తారు? దీని వెనుక ఉన్న కథ ఏమిటి?

**"అగ్నిప్రమాదంతో మారిన సంప్రదాయం"!**

గుండాల గ్రామానికి చెందిన పురోహితుడు శ్రీనివాస్ శర్మ(క్రైమ్ మిర్రర్)కు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో ఇతర గ్రామాల మాదిరిగానే గుండాలలోనూ తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించేవారు. అయితే, ఒకప్పుడు గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు గ్రామంలో పెద్దలు చెబుతుంటారు. ఆ నాటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రముఖులు, ప్రజలు కలిసి సద్దుల బతుకమ్మను ఏడో రోజే నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. ఆ తర్వాత కాలంలో తొమ్మిది రోజుల సంప్రదాయాన్ని తిరిగి కొనసాగించాలనే ప్రయత్నం జరిగినప్పటికీ, పాత ఆచారాన్నే కొనసాగించాలని గ్రామ పెద్దలు నిర్ణయించినట్లు స్థానికంగా ప్రచారంలో ఉన్న కథనం. అప్పటి నుంచి ఏడో రోజే సద్దుల బతుకమ్మను నిర్వహించడం గుండాల గ్రామ సంప్రదాయంగా మారిందని శ్రీనివాస్ శర్మ(క్రైమ్ మిర్రర్) మాట్లాడుతూ తెలిపారు. ((ఎక్కడైనా సద్దుల బతుకమ్మ తొమ్మిది రోజులలో జరుపుకుంటారు అయితే ఓ ప్రాంతంలో ఏడు రోజుల్లోనే బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతూ ఉంటాయి. ఏంటి ఆ ప్రాంతం.. ఏడు రోజుల్లోనే సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి గల కారణాలు ఏంటనే అంశాలపై "క్రైమ్ మిర్రర్" ప్రత్యేక కథను మీకోసం అందించే ప్రయత్నం చేస్తుంది)).

**"తరతరాలుగా అదే ఆనవాయితీ"..**

కాలం మారినా.. తరాలు మారినా.. గుండాల గ్రామంలో మాత్రం ఏడు రోజుల సద్దుల బతుకమ్మ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొంటారు. పాటలు, ఆటలు, కోలాటాలతో గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంటుంది. ఏడో రోజే సద్దుల బతుకమ్మ జరుపుకోవడం



వల్ల గ్రామంలో కోడళ్లుగా ఉన్న మహిళలు తమ అత్తవారింట్లో వేడుకల్లో పాల్గొన్న అనంతరం పుట్టింటికి వెళ్లి అక్కడ కూడా బతుకమ్మ ఆడుకునేందుకు వీలవుతుందని స్థానిక మహిళలు చెబుతున్నారు. ఈ ప్రత్యేకత కూడా పండుగకు మరింత ప్రాధాన్యతను తీసుకొస్తోంది.

**"గుండాల బతుకమ్మకు పొరుగు గ్రామాల నుంచి సందడి"!**

గుండాలలో జరిగే ఏడో రోజు సద్దుల బతుకమ్మ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, మహిళలు తరలివస్తుంటారు. వివిధ పార్టీల నాయకులు సైతం వేడుకల్లో పాల్గొని పండుగ సంబరాలను పంచుకుంటారు. బతుకమ్మ నిమజ్జనం అనంతరం మహిళలు వాయనాలు ఇచ్చిపుచ్చుకొని ఆనందంగా ఇళ్లకు తిరిగి వెళ్తారు. గౌరీదేవి ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఏటా ఈ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు.

**"మరో రెండు గ్రామాల్లోనూ ఇదే ప్రత్యేకత"!**

గుండాల గ్రామంతో పాటు జనగామ జిల్లాలోని పెద్దమడూరు, కోలుకొండ గ్రామాల్లోనూ ఏడో రోజే సద్దుల బతుకమ్మను నిర్వహిస్తున్నట్లు స్థానికంగా చెబుతున్నారు. సాధారణంగా తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకల్లో ఈ గ్రామాల ప్రత్యేక సంప్రదాయం ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. పూల పండుగలో సంప్రదాయమే ప్రత్యేకతగా.. ఏడు రోజుల సద్దుల బతుకమ్మే గుండాల గ్రామానికి గుర్తింపుగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న ఈ ఆచారాన్ని గ్రామ ప్రజలు నేటికీ కొనసాగిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతున్నారు.

# అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సత్యసాయి సేవా సమితి భక్తులు బుధవారం ఉదయం ఆలయానికి విచ్చేసి భజనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తిభావంతో భజన కార్యక్రమాన్ని కొనసాగించారు. నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మ్యాజిక్ షో చిన్నారులు, మహిళలను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటివరకు సుమారు 3,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్మిచర్ల గోపాల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శులు నారాయణరాజు, పానుగంటి నవీన్, కోశాధికారులు గుబ్బ కిషన్, వాస మనీష్, ప్రోగ్రామ్ ఆఫీసర్ బాదం రాఘవేందర్, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వాసా శేఖర్, చిగుళ్లపల్లి శ్రీధర్, గుగ్గిల శంకర్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గోవిందు మౌనిక, కల్మిచర్ల స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మానసిక దివ్యాంగులకు అన్నదానం

**౦ దివ్యాంగులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి**



**కోదాడ, అక్టోబర్ 14 (క్రైమ్ మిర్రర్):** కోదాడ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా కోదాడ పట్టణంలోని శనగల రాధాకృష్ణ ట్రస్ట్‌లో మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సూర్యాపేట జిల్లా బీజేపీ దివ్యాంగుల సెల్ జిల్లా కన్వీనర్ ఏమిరెడ్డి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చల్ల శ్రీలతరెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేసేలా జరుపుకోవడం అభినందనీయమన్నారు. సమాజంలోని దివ్యాంగులు, నిరుపేదలు, వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.దివ్యాంగులకు ఆప్యాయత, ఆదరణ అందించడంతో పాటు వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని, సమాజంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సేవాభావంతో సమాజంలోని ప్రతి ఒక్కరినీ తమ కుటుంబ సభ్యులుగా భావించి పనిచేయడమే సేవా సంకల్ప్ అభియాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి అండగా నిలవడం ద్వారా సమాజంలో సేవాభావాన్ని పెంపొందించవచ్చని అన్నారు. మానసిక దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఏమిరెడ్డి శంకర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల విభాగ కో కన్వీనర్ గోలి ప్రభాకర్, జిల్లా కోశాధికారి తాళ్ల నరేందర్ రెడ్డి, జిల్లా ప్రవాసి సెల్ కన్వీనర్ జల్లా జనార్దన్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పరశురామ్, బీజేపీ నాయకుడు సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 108 చీరలతో కనకదుర్గమ్మ కు విశేష అలంకరణ

**మహా చండీదేవిగా అమ్మవారి దర్శనం మహిళల కుంకుమ పూజలు**



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పట్టణంలోని శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుచున్నాయి. నాలుగవ రోజు బుధవారం అమ్మవారు శ్రీ మహాచండీ దేవి గా భక్తులకు దర్శనమిచ్చారు. 108 రకముల చీరలతో అమ్మవారికి అలంకరణ జరిపారు. అల్లం గారెలు, పరమాన్నం అమ్మవారికి ప్రసాదాన్ని నివేదించారు. 108 చీరల దాత దుబ్బాక మహేందర్ రెడ్డి మాధవి దంపతులకు ఈ సందర్భంగా ఆలయ కమిటీ అభినందనలు తెలిపింది. మహిళలు కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ఛైర్మెన్ మారగోని ఆంజనేయులు గౌడ్ నేతృత్వంలో దౌలతాబాద్ వాసుదేవ శర్మ అర్చకత్వంలో పూజాదికాలు జరిగాయి. డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్ట సాయిలు, బెలిదె సత్యనారాయణ, ఏళ్ల మాధవి బయ్యన్న, కుమ్మరి దేవి రవి, ఆలయ అధికారి ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చన, బాల బాలికలచే సరస్వతి పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మెన్ మారగోని ఆంజనేయులు గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుందని అన్నారు. మహిళలు చిన్నారు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమ్మవారిని దర్శించుకున్న నేతలు బుధవారం కనకదుర్గ అమ్మవారిని చిట్యాల మున్సిపల్ ఛైర్ పర్సన్ పందిరి గీత రమేష్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ పందిరి శ్రీనివాసులు, చిట్యాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తేరటుపల్లి హనుమంతు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు తో పాటు స్థానిక హెచ్.పీ గ్యాస్ డీలర్ గోవర్ధన్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాహుల్**

**చందూరు,క్రైమ్ మిర్రర్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాహుల్ సూచించారు. బుధవారం చందూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన బాలికలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్ పి వి) టీకాను తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం మందుల నిల్వలను, గడువు తేదీలను ,పలు రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట హెచ్ఈఓ అంజయ్య, రంజిత్, వైద్యాధికారి డాక్టర్ సంధ్య, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఉన్నారు.





# హకీకా కార్యక్రమానికి హాజరైన ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈరోజు షేక్ ఉద్దండ్ సాహెబ్, నైమా బేగం మనవరాలు మరియు మనవళ్ల హకీకా కార్యక్రమానికి ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు వీరభద్రం ,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్ ,ఎన్ ఎస్ యు జిల్లా అధ్యక్షులు ఆసిఫ్ ఖమ్మం జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిలారు వెంకటరమణ తో పాటు మండల నాయకులు, పంది రాజు గౌడ్ , వినయ్ యాదవ్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**౦ అర్హులైన ఓటర్ల పేర్లను వెంటనే జాబితాలో చేర్చాలి : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మల్కాజిగిరి చౌరస్తా నుంచి ఆనంద్‌బాగ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల హక్కులను కాలరాయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగింపునకు గురైన అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని, వారి నుంచి ఎలాంటి పనులు, వసూళ్లు చేపట్టకూడదని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు దక్కే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్,ఏ కె మురుగేష్, మల్కాజిగిరి ఇంచార్జీ లక్ష్మీ కాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్,గుండా నిరంజన్, జివిన్స్ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్,రాందాస్ సంతోష్ ముదిరాజ్, రామచందర్ బాబు సత్యనారాయణ డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, వైనాల ప్రవీణ్, పిట్టల నాగరాజు, యూసుఫ్ భాయ్, రాఘవన్, లక్ష్మీ,ఎస్ ఆర్ ప్రసాద్, రామచందర్,ఫరీద్, సయ్యద్ ముబ్బు,ఆశా, సుమలత యాదవ్, కనకలక్ష్మి శారద, పుష్ప లత, బ్రహ్మయ్య, పీవీ సత్యనారాయణ,ఉపేందర్ రెడ్డి, రామక్రిష్ణ వెంకన్న సిరిగిరి రాజు కన్నా,సందీప్ గౌడ్, ఇస్తారి,చుంకు శ్రీనివాస్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ కనకదుర్గ మండలి ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజ కార్యక్రమం

**మందమర్రి టౌన్ అక్టోబర్14 క్రైమ్ మిర్రర్:** శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మందమర్రి పట్టణం రెండవ జూన్ లో ప్రతిష్టించిన శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ కనకదుర్గ మండలి ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో భాగంగా అమ్మవారికి కుంకుమార్చన చేసి, లోకకల్యాణం, కుటుంబాల సుఖసంతోషాలు, ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నానేబియ్యం బతుకమ్మ వేడుకలు

o ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

o మెప్మా, మున్సిపల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న మహిళలు, ఉద్యోగులు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో నాల్గవ రోజు నానేబియ్యం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ వేడుకలు కార్యాలయంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది, ఉద్యోగులు పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గౌరమ్మను కొలిచి ఆట, పాటలతో సందడి చేసారు.



# కడ్తాల్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

**రూ.20 లక్షల విలువైన 170 గ్రాముల క్రిస్టల్ మెథాంఫెటమైన్ స్వాధీనం**

**మహేశ్వరం జోన్ ఎస్ఓటీ, కడ్తాల్ పోలీసుల సంయుక్త దాడిలి**

**ఇద్దరు అరెస్ట్, మరో ఇద్దరి కోసం గాలింపు**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(కడ్తాల్):** మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మహేశ్వరం జోన్ ఎస్ఓటీ బృందం, కడ్తాల్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో అంతర్రాష్ట్ర డ్రగ్స్ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ముంబై నుంచి కడ్తాల్‌కు అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.20 లక్షల విలువైన 170 గ్రాముల క్రిస్టల్ మెథాంఫెటమైన్ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. బుధవారం కర్తాల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 14న విశ్వసనీయ సమాచారం అందడంతో కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఎస్సై రవీందర్ తన సిబ్బందితో కలిసి కడ్తాల్ టోల్‌గేట్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ముంబై నుంచి నల్లరంగు మారుతి స్విఫ్ట్ కారులో డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, సిద్ధిక్ అనే వ్యక్తి సూచనల మేరకు ముంబైలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద డ్రగ్స్ తీసుకున్నట్లు వెల్లడైంది. వాటిని రింకూ ఠాగూర్ అనే మహిళకు అప్పగించేందుకు కడ్తాల్ టోల్‌గేట్ వద్ద వేచి ఉన్నట్లు నిందితులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. టోల్‌గేట్ సీసీ కెమెరాలు, నిఘా వ్యవస్థకు చిక్కకుండా ఉండేందుకు కారుకు సంబంధించిన నంబర్ ప్లేట్లను తొలగించినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 170 గ్రాముల క్రిస్టల్ మెథాంఫెటమైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 50 గ్రాములు, 60 గ్రాములు, మరో 60 గ్రాముల చొప్పున మూడు ప్యాకెట్లలో ఈ డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షలుగా అంచనా వేశారు. వీటితో పాటు నంబర్ ప్లేట్లు తొలగించిన నల్లరంగు మారుతి స్విఫ్ట్ కారు, రెండు ఐఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కేరళ రాష్ట్రం కాసరగోడ్ జిల్లాకు చెందిన బవుదల్ ఉమ్మర్ అబ్దుల్ అజీజ్ (34), హంసత్ షనాస్ (32)లను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ సరఫరాదారుడిగా పేర్కొంటున్న సిద్ధిక్, డ్రగ్స్ స్వీకరించాల్సిన వ్యక్తిగా గుర్తించిన రింకూ ఠాగూర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్ సరఫరా వ్యవస్థను పూర్తిగా అరికట్టడంతో పాటు అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినవారు పోలీసులకు తెలియజేసి సహకరించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని కోరారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్, అదనపు డీసీపీ షేక్ జహంగీర్, మహేశ్వరం డివిజన్ ఏసీపీ ఎస్. జానకీ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. సైదిరెడ్డి, మహేశ్వరం జోన్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ టి. రవికుమార్, ఎస్ఓటీ ఎస్ఐ సురేష్, కడ్తాల్ ఎస్ఐలు ఎం. రవీందర్, బి. చంద్రశేఖర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 24 గంటల విద్యుత్ అందించాలి

**వెలిమినేడు సబ్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతు ధర్నా**




**చిట్యాల క్రైమ్ మిర్రర్:** రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు సబ్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు గతంలో ఉన్న పరిస్థితులను తిరిగి తీసుకొస్తామని చెప్పారని, ప్రస్తుతం రైతులకు సక్రమంగా విద్యుత్, సాగునీరు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వంటి విద్యుత్ ఉత్పత్తి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతుల మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్‌తో పాటు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు..

## యోగా శిబిరం ప్రారంభం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ కుమార్ రెడ్డి సహకారంతో వారం రోజులపాటు నిర్వహించే సుదర్శన క్రియ యోగా, ధ్యాన కార్యక్రమాలు బుధవారం గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు గ్రామస్థులు, యువకులు, భవానీ మాలధారులకు యోగా, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాల్లో శిక్షణ ఇచ్చారు. సుదర్శన క్రియ సాధనతో ఒత్తిడిని తగ్గించుకొని మానసిక ప్రశాంతత, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా గుత్తా అమిత్ కుమార్ రెడ్డి యువత ఒత్తిడి, ఆందోళనలకు దూరంగా ఉంటూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలని, సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ట్రస్ట్ చైర్మన్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ సత్యనారాయణ, పల్లపు ప్రశాంత్, ఆవుల రమేష్ యాదవ్ తదితరులు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





## అంగడిపేటలో ఘనంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి 8వ వార్షికోత్సవం

**అమ్మవారిని దర్శించుకున్న బీసీ నేతలు**

**చండూర్, క్రైమ్ మిర్రర్:** దేవి నవరాత్రుల శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట 5వ వార్డులో శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి 8వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. ఈ పవిత్ర వేడుకల్లో భాగంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్ మరియు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బూడిద మల్లికార్జున్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ?ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారి ఆశీస్సులు కోరారు. అనంతరం శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ తమ ఉద్యమ సహచరులైన పానుగంటి విజయ్ మరియు బూడిద మల్లికార్జున్‌లను ఘనంగా శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి నామస్మరణతో అంగడిపేట ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

## ఇజ్జత్ నగర్‌లో ఘనంగా దుర్గామాత పూజలు

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** ఇజ్జత్ నగర్‌లో జగత్ జనని టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గామాత పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, బీజేపీ మాదాపూర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ రాధాకృష్ణ యాదవ్ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం అందించారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, ఇజ్జత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, నరేష్ రెడ్డి, కురుమయ్య, పవన్ రెడ్డి, సుధాకర్, ఆనంద్, కుమార్, సురేష్, నవీన్, బాలమ్మ, చెన్నమ్మ, మేఘన్ను యాదవ్, నిఖిల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

**కూనూరు సంజయ్ దాస్ గౌడ్ డిమాండ్**



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చిట్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురవక, సాగునీరు అందక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు కోసం పెట్టిన పెట్టుబడులతో పాటు పంటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి రైతులను ఆదుకోకపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్వరాష్ట్రం ఏర్పడితే రైతుల జీవితాల్లో ఆనందం నిండుతుందని ఆశించామని, ప్రస్తుత పరిస్థితులు రైతులను నిరాశకు గురిచేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. వర్షాభావంతో పంటలు ఎండిపోయిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయడంతో పాటు వడ్డీ మాఫీ చేయాలని, కరువు కారణంగా వలసలు పెరగకుండా ఉపాధి హామీ పథకం పనిదినాలను పెంచి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వేణుగోపాల్ రెడ్డి, నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు లింగస్వామి, భువనగిరి పార్లమెంట్ నాయకులు బత్తుల నాగరాజు గౌడ్, సి.హెచ్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పందులు పట్టే వారిపై దాడి చేయడం హేయమైన చర్య...

**మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు**



**చండూరు,క్రైమ్ మిర్రర్:** చండూరు మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో రోజురోజుకు పందులు విపరీతంగా సంచరిస్తున్నాయి. డెంగ్యూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలకుండా, ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం నాడు స్థానిక మున్సిపల్ పాలకవర్గం, అధికారులు పందులను పట్టించి, వాహనంలో తరలిస్తున్న సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గర పందుల పెంపకందారులు అడ్డగించారు. పోలీసులు వారిని వారించి పంపించగా పందులను తీసుకెళ్లే వ్యాన్ వెంట పడి మునుగోడు దగ్గరలో అట్టి వాహనంను దొరికించుకొని వ్యాన్ అద్దాలను పగలగొట్టి, పందులను పట్టే వారిపై పెంపకం దారులు దాడి చేశారు. అంతలోనే మునుగోడు ఎస్సై శోభన్ బాబు సిబ్బందితో వచ్చి దాడి చేసిన వారిని పోలీస్ స్టేషన్ కు తరలించి, కేసులు నమోదు చేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులును వివరణ కోరగా పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ అన్ని వీధులలో తిరిగే పందులను పట్టించామని, పందుల పెంపకందారులకు మూడుసార్లు నోటీసులు పంపామని, మున్సిపాలిటీ కార్యాలయమునకు పిలిపించి అనేకమార్లు తెలిపామని, అయినా పెంపకందారులలో మార్పు రాలేదని అన్నారు. చండూరు మున్సిపాలిటీలో సుమారు 25 వేల మంది ప్రజలు నివసిస్తున్నారని, వారి ఆరోగ్య భద్రతే మాకు ముఖ్యమని, భవిష్యత్తులో చండూరు మున్సిపాలిటీ వార్డులలో విచ్చలవిడిగా పందులు తిరిగితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పందులు పట్టే వారి పైన, వారి వ్యాన్ పైన దాడి చేయడం హేయమైనచర్య అని అన్నారు. దాడిలో బిఆర్ఎస్ కౌన్సిలర్ కొండ్రెడ్డి మధు ఉన్నారని, పందుల పెంపకందారులకు బిఆర్ఎస్ నాయకులు మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు ఋషిపాక వాసు, కటకం రమేష్, కోడి సుష్మా వెంకన్న, జెల్ల ధనమ్మ శ్రీనివాస్, గజల కృష్ణారెడ్డి, గురిజ మహేష్, గండూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఎల్బీనగర్‌లో వైభవంగా అమ్మవారి పూజలు

**o అన్నపూర్ణాదేవిగా దర్శనం.. 108 రకాల నైవేద్యాల సమర్పణ**
**o ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నగరంలోని 8వ డివిజన్ ఎల్బీనగర్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు అమ్మవారు భక్తులకు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి భక్తిప్రపత్తులతో 108 రకాల పిండివంటలు ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆశీస్సులతో బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్ బాబు సహకారంతో బిఆర్ఎస్ నాయకుడు వాంకుడోత్ సురేష్ నాయక్ దంపతులు ఈ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాజీ ఎంపీ మాలోత్ కవిత ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సంక్షేమానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని పేర్కొంటూ మళ్లీ కేసీఆర్ ప్రజాపాలన రావాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం వారు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పగడాల నాగరాజు చిరుమామిళ్ల కిరణ్ దండ జ్యోతి రెడ్డి అయ్యప్ప రెడ్డి వీరేందర్ గౌడ్ మాటేటి కిరణ్ కుమార్ మోరంపూడి సాయి బొడ్డు వెంకటేశ్వర్లు రెంటపల్లి రమేష్ వడనపు శ్రీనివాసరావు రామకృష్ణ అకేటి అర్జున్ గొల్లపూడి ఉపేందర్ తెలపురెడ్డి గోపిరెడ్డి షైక్ రహీమ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ం నల్గొండలో అఖిల భారత రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయాలి

ం తెలంగాణ రైతు సంఘం జనరల్ బాడీ సమావేశంలో కామ్రేడ్ బండి రమేష్ పిలుపు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ అన్నదాతలను సంక్షోభంలోకి నెడుతున్నాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ బండి రమేష్ విమర్శించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెంలో తోట పెద్ద వెంకట రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన తెలంగాణ రైతు సంఘం ఖమ్మం రూరల్ మండలం మరియు మున్సిపాలిటీల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, యూరియా కొరతను నివారించి అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు నవంబర్ 14,15,16 తేదీలలో నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం మహాసభలను " ఇంటికో మనిషి - ఊరికో బస్సు" అనే స్ఫూర్తితో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని బండి రమేష్ కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘానికి నూతనంగా ఎన్నికైన నాయకులకు సంఘం బలోపేతానికి అవసరమైన దిశా నిర్దేశం చేసి, శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రైతు సంఘం ఖమ్మం రూరల్ మండలం కార్యదర్శిగా ప్రతాపనేని వెంకటేశ్వర్లు,అధ్యక్షులుగా కొప్పుల ఉపేందర్ ,ఉపాధ్యక్షులుగా వరగాని మోహన్ రావు మరియు ఏదులాపురం మున్సిపాలిటీ కార్యదర్శిగా తోట పెద్ద వెంకట రెడ్డి,అధ్యక్షులుగా ధనియాకుల రామయ్య,ఉపాధ్యక్షులుగా పెంట్యాల నాగేశ్వరరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్,పాలేరు డివిజన్ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు బిక్కసాని గంగాధర్, గుడవర్తి నాగేశ్వరరావు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఊరడి సుదర్శన్ రెడ్డి, ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి వల్లమూడి నాగేశ్వరరావు,ప్రజా నాట్య మండలి పాలేరు డివిజన్ కార్యదర్శి నందిగామ కృష్ణ, ఆరెకోడు సర్పంచ్ ఆరెంపుల రమాదేవి, ఏదులాపురం మున్సిపాలిటీ 31 వ వార్డు కౌన్సిలర్ ఊరడి హైమావతి,వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు కారుమంచి గురవయ్య,ఏటుకూరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



## చండూరు మర్కండేయ ఆలయంలో మహాచండీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు మర్కండేయ ఆలయంలో బుధవారం నాలుగో రోజు అమ్మవారు మహాచండీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.పూజా కర్తలు గంజి విశ్వనాథం-పారిజాత దంపతులు.ఇక్కత్ పట్టు చీరను సమర్పించిన మాస్టర్ వివర్ చిలుకూరి చంద్రశేఖర్(అరుంధతి హ్యాండ్లూమ్స్) అన్న ప్రసాద వితరణ దాత చెరిపల్లి భిక్షమయ్య-శోభ దంపతులు, వారి కుమార్తె డా. హరిణి. నవరాత్రిలలో కంకణదధారులకు అన్నప్రసాద దాత కర్నాటి విద్యాసాగర్-కరుణశ్రీ, నిత్య పులిహోర సమర్పణ జూలూరు కృష్ణయ్య-పద్మ, ఇక్కత్ చీరల దాతలు గంజి యాదగిరి-యశోద,జూలూరు ఆంజనేయులు-పద్మ, జూలూరు శ్రీనివాసులు-సునీత, చిలుకూరి శ్రీనివాసులు-రాధిక, పగిడిమర్రి శ్రీనివాసులు-జయలక్ష్మి, చిలుకూరి నర్సింహ్మా-లక్ష్మమ్మ, చెరపల్లి అంజయ్య-యాదమ్మ, కలిమికొండ మహేష్-గిరిజ, పద్మావతి హ్యాండ్లూమ్స్(యేశాల హరీష్.నవరాత్రిలలో నిత్యపూల దండల దాతలు గుర్రం భిక్షమయ్య, కోమటి వీరేశం, అర్చక దాత పాల్వాయి ప్రవంతిరెడ్డి,హోమ సామగ్రి దాత కోడి వెంకటేశం-కళమ్మ, పూజా సామాగ్రి దాత జూలూరు శేఖర్-వరలక్ష్మి, అమ్మవారికి నిత్య లడ్డూల దాతలు ఏలె శ్రీనివాసులు, కోడి శివశంకర్‌వస్తురూపేణ దాతలు కటకం రమేష్, ఏలె శ్రీనివాసులు, జూలూరు వెంకటేశం, పూజా కార్యక్రమంలో పాల్గొను భక్తులు ఉత్సవ కమిటీ వద్ద పేరు నమోదు చేసుకోవాలని ఆలయ ఛైర్మన్ రావిరాల నగేష్ తెలిపారు. అలాగే అమ్మవారి చీరల వేలం పాటలో ఆసక్తి గల భక్తులు తమ పేరును ఫోన్‌నెం. 9985041123, 8885440002, 9885751117,8142246328లకు సంప్రదించాలని తెలిపారు.

## ఆర్టీఐ దరఖాస్తులకు సమాధానాలేవీ ? : ఆర్టీఐ సతీష్

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందించి, అధికారులను జవాబుదారీగా నిలబెట్టేందుకు రూపొందించిన సమాచార హక్కు చట్టం--2005 అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు సమర్పించినప్పటికీ, నిర్ణీత గడువులో సమాధానాలు అందకపోవడం, అసంపూర్ణ సమాచారం ఇవ్వడం వంటి సమస్యలతో దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్టిఐ రక్షక్ వ్యవస్థాపకుడు ఆమనగంటి సతీష్ తెలిపారు. చట్టంలోని సెక్షన్ 7(1) ప్రకారం సాధారణంగా ఆర్టీఐ దరఖాస్తులకు 30 రోజుల్లోగా సమాచారం అందించాలి. జీవితం లేదా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన సమాచారం అయితే 48 గంటల్లో అందించాల్సి ఉంటుంది. అయినప్పటికీ కొన్నిచోట్ల సమాచారం కోసం దరఖాస్తుదారులు పలుమార్లు కార్యాలయాలకు వెళ్లడం, లేఖలు రాయడం, మొదటి అప్పీల్ దాఖలు చేయడం వంటి చర్యలు చేపట్టాల్సి వస్తోంది. దీంతో సమయం, డబ్బు వృథా అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు) తమ బాధ్యతలను గుర్తించి, చట్ట నిబంధనల ప్రకారం సకాలంలో సమాచారం అందించాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. సమాచారాన్ని నిరాకరించే సందర్భాల్లో చట్టబద్ధమైన కారణాలను తెలియజేయాలని పేర్కొంటున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి, సమాచార హక్కు చట్టం అమలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు కల్పించిన సమాచార హక్కు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, పారదర్శక పాలనకు దోహదపడేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

# పూల పండుగ బతుకమ్మ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక

ం వాగ్దేవి కళాశాలలో సంప్రదాయాల పరిమళం

ం బతుకమ్మ సంబరాల్లో మహిళా అధ్యాపకుల సందడి

ం ఈఈఈ విభాగం మహిళా అధ్యాపకుల ఆధ్వర్యంలో సంబరాలు

ం రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ జిల్లా బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం మహిళా అధ్యాపకుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. తెలంగాణ పూల పండుగ ప్రత్యేకతను చాటిచెబుతూ సంప్రదాయాల పట్ల తమకున్న మమకారాన్ని చాటుకున్నారు.

### పూలతో పేర్చిన బతుకమ్మ.. సంప్రదాయానికి సరికొత్త అందం

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రత్యేకతను ఈ వేడుకలు గుర్తుచేశాయి. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, పండుగ వైభవాన్ని ప్రతిబింబించేలా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు పండుగల వెనుక ఉన్న సంప్రదాయ విలువలను గుర్తుచేసేలా ఈ వేడుకలు నిలిచాయి.



### సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం

విద్యాసంస్థలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సామాజిక బాధ్యత, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో బతుకమ్మ వంటి పండుగల ప్రాముఖ్యతను చాటిచెప్పడం ద్వారా తెలంగాణ వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ వేడుకలు గుర్తుచేశాయి.

తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుంది. పూలను పూజిస్తూ ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే ఈ పండుగ తరతరాలుగా తెలంగాణ ప్రజల జీవన విధానంలో భాగమై కొనసాగుతోంది.

### తెలంగాణ సంస్కృతికి బతుకమ్మే ప్రతీక

ఆధునిక విద్యతో పాటు మన మూలాలను, మన సంస్కృతిని గుర్తుంచుకోవడం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని బతుకమ్మ వేడుకలు చాటిచెబుతున్నాయి. తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి పరిచయం చేసే పూల పండుగను విద్యాసంస్థల్లోనూ నిర్వహించడం ద్వారా సంప్రదాయాల పట్ల గౌరవాన్ని మరింతగా పెంపొందించవచ్చు. రంగురంగుల పూలతో అలరించే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆనందానికి, ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది.

# మీ ఓటు.. మీ హక్కు.. పట్టాభద్రులారా, నమోదు చేసుకోండి!

**నవంబర్ 6 చివరి తేదీ.. అర్హులైన పట్టభద్రులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలిం**




**కోదాడ, అక్టోబర్ 14(క్రైమ్ మిర్రర్ ):** ఖమ్మం--నల్లగొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును పొందేందుకు ఓటరుగా నమోదు చేసుకోవాలని పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకుని, భవిష్యత్తులో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హత ఉన్నప్పటికీ, చాలామంది పట్టభద్రులు ఇప్పటివరకు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోకపోవడం వల్ల ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకోవడంతో పాటు, ఇతర పట్టభద్రులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు.నవంబర్ 6 వరకు గడువు.. చివరి నిమిషం వరకు వేచి చూడొద్దు!పట్టభద్రుల ఓటరు నమోదుకు 2026 నవంబర్ 6 చివరి తేదీగా పేర్కొంటూ, అర్హులైన వారు గడువు ముగిసే వరకు వేచి చూడకుండా ముందుగానే తమ దరఖాస్తులను సమర్పించాలని నాయకులు సూచించారు. ఓటరు నమోదుకు అవసరమైన అర్హతలు, ధ్రువపత్రాలు, దరఖాస్తు విధానం తదితర వివరాలను సంబంధిత ఎన్నికల అధికారుల ద్వారా తెలుసుకుని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమతో పాటు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తుల్లో అర్హులైన పట్టభద్రులకు కూడా ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగుల ఇబ్బందులు, విద్యావంతుల ఆశయాలు, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై తమ అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేసేందుకు ఓటు హక్కు ఒక ముఖ్యమైన సాధనమని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదై ఉండటం ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనేందుకు తొలి అడుగు అని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు బాధ్యతగా వ్యవహరించి ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని కోరారు. పట్టభద్రులందరూ చైతన్యవంతులై తమ ఓటు హక్కును పొందడంతో పాటు, ఎన్నికల సమయంలో దానిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నవారు.ఈ ఓటరు నమోదు కార్యక్రమంలో ఓరుగంటి ప్రభాకర్, సాతులూరి గురవయ్య, కట్టా సతీష్, సోంపేట బాలకృష్ణ, కోదాడ రేవంత్ రెడ్డి, ఏటుకూరి సురేష్, ఆశిష్, జువ్వాజి ప్రవీణ్ పాల్గొన్నారు.

# సెక్షన్ 22-ఎ పేరుతో బ్లాక్ లిస్టులో పెట్టిన భూములను బహిర్గతం చేయాలి

**ల్యాండ్ పూలింగ్ పేరుతో పేదల భూములను తీసుకోవాలనే ప్రతిపాదనను విరమించుకోవాలి**

**సమగ్ర భూ సర్వే చేసి మిగులు భూములను పేదలకు పంచాలి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు డిమాండ్**



**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** రాష్ట్రంలో సెక్షన్ 22-ఎ పేరుతో బ్లాక్‌లిస్టులో పెట్టిన భూముల వివరాలను ప్రభుత్వం వెంటనే బహిర్గతం చేయాలని, ల్యాండ్ పూలింగ్ పేరుతో పేదల భూములను తీసుకోవాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని, సమగ్ర భూ సర్వే నిర్వహించి మిగులు భూములను పేదలకు పంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. బుధవారం సుందరయ్య భవన్, భువనగిరిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూ సమస్యపై " రౌండ్ టేబుల్ సమావేశం " జిల్లా అధ్యక్షులు జల్లెల్ల పెంటయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వెంకట్రాములు పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 1,02,52,690 ఎకరాల భూమి సెక్షన్ 22-ఎ నిషిద్ధ జాబితాలో ఉందని, ఇది రాష్ట్ర మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో మూడో వంతు కంటే ఎక్కువని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాబితాలో 24,63,940 ఎకరాల అసైన్డ్ భూములు, 42,53,532 ఎకరాల అటవీ భూములు, 29,35,554 ఎకరాల ఇతర ప్రభుత్వ శికం భూములతో పాటు 3,95,852 ఎకరాల ప్రైవేట్ భూములు ఉన్నాయని పేర్కొన్నారు. నిషిద్ధ జాబితాలోని దాదాపు 94.1 శాతం భూములు ప్రభుత్వ కేటగిరీకి చెందినవే అయినప్పటికీ, 2023తో పోలిస్తే ప్రస్తుతం ఈ జాబితాలో సుమారు 47,440 ఎకరాల భూమి తగ్గిందని, ఈ తగ్గిన భూమి వివరాలను ప్రభుత్వం వెంటనే ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో పేదలకు గతంలో ఇచ్చిన అసైన్డ్ భూములను ఎలాంటి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటోందని విమర్శించారు. పేదల నుండి గుంజుకుంటున్న భూములను కార్పొరేట్లకు, కాంట్రాక్టర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారని వారు ప్రభుత్వంపై మండిపడ్డారు. ధరణి పోర్టల్‌లోని లోపాల వల్ల ఒక సర్వే నంబర్‌లోని కొంత భూమి ప్రభుత్వ స్వాధీనంలో ఉంటే, "ఆటో- లాక్ " విధానం ద్వారా మిగిలిన పూర్తి సర్వే నంబర్‌పై లావాదేవీలను నిలిపివేస్తూ సామాన్య రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి స్పష్టమైన సమాధానం లేకుండా అనేక ప్రైవేట్, పట్టా భూములను కూడా ఈ నిషిద్ధ జాబితాలోకి చేర్చారని, దీనిపై కాలయాపన చేయకుండా కాలపరిమితితో కూడిన పరిష్కారం చూపాలని కోరారు. సెక్షన్ 22-ఎ జాబితా తయారీ, సవరణ, తొలగింపు ప్రక్రియలకు సంబంధించిన రికార్డులను పారదర్శకంగా గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంచాలని, అలాగే రాష్ట్రంలో బీడు, బంజరు భూములు కలిపి ఉన్న సుమారు 31 లక్షల ఎకరాల భూములను గుర్తించి పేదలకు పంచడంతో పాటు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోడు భూములు, అసైన్డ్ భూములను సాగుచేసుకుంటున్న రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించడంతో పాటు ప్రతిష్టాత్మక కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని, భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవంబర్ 10 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రత్యేక భూ ఆక్రమణ పోరాటాలు, ఉద్యమాలు ప్రారంభిస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.




# శిల్పారామంలో బతుకమ్మ వేడుకలు, ఆది బజార్ ప్రారంభం....

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** శిల్పారామం మాదాపూర్ లో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా సిబ్బంది బతుకమ్మలు పేర్చి, సాయంత్రం సందర్శకులతో కలిసి బతుకమ్మ ఆట ఆడుకున్నారు. అదే సందర్భంగా ట్రైబల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆది బజార్' ట్రైబల్ మేళాను శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్ రావు, ఐఏఎస్ ప్రారంభించారు. ఈ మేళా అక్టోబర్ 14 నుండి 21 వరకు కొనసాగుతుంది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు తమ ఉత్పత్తులను సందర్శకులకు అందుబాటులో ఉంచారు.నాట్య గురువు శ్రీ ప్రమోద్ రెడ్డి శిష్య బృందం భరతనాట్యంలో "దేవి కీర్తన మాలిక", "దేవి వైభవం" అంశాలను దాదాపు 60 మంది కళాకారులతో ప్రదర్శించి, చక్కని అభినయంతో ప్రేక్షకులను మెప్పించారు.

# సంగారెడ్డి అభివృద్ధికి మరో ముందడుగు

**రూ.80 లక్షలతో 31, 11వ వార్డుల్లో సిసి రోడ్డు పనులు ప్రారంభం**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 14:** పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 31వ, 11వ వార్డుల్లో సుమారు రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డి పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్‌తో పాటు పాలకవర్గాన్ని అభినందించారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సతీశ్ రెడ్డి, దశరథ్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, తులసిరామ్, శ్రీశైలం, అన్వర్, రామచందర్ గౌడ్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

